

ప్రజావాణి రద్దు : సంగారెడ్డి కలెక్టర్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో జిల్లాస్థాయి అధికారులు నిమగ్నమై ఉన్నందున కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. తిరిగి ప్రజావాణి ఎప్పుడు నిర్వహించేది పత్రికల ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు.



సంగారెడ్డి పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి

సంగారెడ్డిలో భారీ మెజారిటీ రావాలి

నియోజకవర్గ కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్నందున ప్రత్యర్థిపై కాంగ్రెస్ అభ్యర్థికి 3వేల ఓట్ల ఆధిక్యం వచ్చేలా చూడాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కార్యకర్తలకు సూచించారు. సంగారెడ్డి పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన సంగారెడ్డి మండలస్థాయి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 3వేల మెజారిటీ రావాలని కార్యకర్తలకు జగ్గారెడ్డి సూచించారు. పార్టీ సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

జగ్గారెడ్డి తల్లిదండ్రుల పేర్ల మీద

లయన్స్‌క్లబ్‌కు అంబులెన్స్

జమయమ్మ, జగ్గారెడ్డి జ్ఞాపకార్థం సంగారెడ్డి లయన్స్ క్లబ్‌కు అందజేసిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డిలో అంబులెన్స్‌కు రిబ్బన్ కట్ చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తల్లిదండ్రులు జమయమ్మ, జగ్గారెడ్డి పేర్ల మీద సంగారెడ్డి లయన్స్‌క్లబ్‌కు అంబులెన్స్‌ను ఆదివారం టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు లయన్స్‌క్లబ్ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ రాములుగౌడ్, రీజినల్ చైర్మన్ కరుణాకరగౌడ్, జోనల్ చైర్మన్ వెంకటేశం, ప్రెసిడెంట్ జార్జ్, కార్యదర్శి నాయికోటి రామప్ప, కోశాధికారి కృష్ణ, జిల్లా చైర్మన్ విజయేందర్‌రెడ్డి, సభ్యులు హనుమంత్‌గౌడ్, రామ్‌గోపాల్, వెంకన్న, లాడే మల్లేశం, సునీల్‌కుమార్, మాణిక్‌రావు, కిరణ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పోలింగ్ కేంద్రాల్లో కోత!

గతంలో 600 ఓటర్లకో కేంద్రం.. ప్రస్తుతం 700 ఓటర్లకు ఒకటి చొప్పున..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధికారుల కసరత్తు

మెదక్ జిల్లావ్యాప్తంగా 21 జడ్పీటీసీ, 190 ఎంపీటీసీ స్థానాలు



మెదక్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి మార్గదర్శకాలమేరకు స్థానిక సంస్థల ఎన్నిల నిర్వహణకు మెదక్ జిల్లా అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఇప్పటికే జిల్లా పరిషత్ ప్రాదేశిక, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ స్థానాలపై నివేదికలను ప్రభుత్వానికి పంపారు. 2019 ఎన్నికల్లో జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాలు ఉండగా ఈసారి కొత్తగా మరో స్థానం పెరిగింది. కొత్తగా ఏర్పడిన మాసాయిపేట మండలం జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు జత చేరాయి. దీంతో మెదక్ జిల్లావ్యాప్తంగా 21 జడ్పీటీసీ, 190 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జడ్పీ సీఈవో ఎల్లయ్య తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల క్రమంలోనే పరిషత్ ఎన్నికలు కూడా జరగనుండడంతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రం, అందులో ఉండాల్సిన బూత్‌ల సంఖ్యపై అధికారులు దృష్టిసారిస్తున్నారు.

తగ్గనున్న బూత్‌లు..

మెదక్ జిల్లాలో 1,030 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. గతంలో 600 మందికి ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్ నిర్దేశించగా, తాజా మార్గదర్శకాల ప్రకారం 700 మంది ఓటర్లకు ఒక కేంద్రం చొప్పున ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొత్త ఆదేశాల ప్రకారం జిల్లాలో పోలింగ్ బూత్‌లు తగ్గే అవకాశం ఉంది. దీనిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీలవారీగా బ్యాలెట్‌పత్రాల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే బ్యాలెట్ బాక్సులను అధికార యంత్రాంగం సిద్ధం చేస్తోంది. ఈ ఎన్నికలు రాజకీయ పార్టీల గుర్తులతో జరుగుతాయి. జడ్పీ అధికారులు ఎన్నికల అభ్యర్థుల నామినేషన్ పత్రాల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. నామినేషన్ల స్వీకరణకు సమీప ప్రాంతాల గ్రామాలను యూనిట్లుగా చేసుకొని మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాట్లు చేయనున్నారు. రిటర్నింగ్ అధికారులుగా సీనియర్ అసిస్టెంట్ల స్థాయి అధికారులను నియమించనున్నారు. ఒక్కో ఆర్వో కేంద్రంలో రిటర్నింగ్ అధికారితో పాటు ముగ్గురు సహాయ రిటర్నింగ్ అధికారులు అందుబాటులో ఉంటారు.

నేడు ముసాయిదా జాబితా ప్రదర్శన



జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓటర్ల జాబితాను ఈ నెల 10న ప్రకటించనున్నాం. కేంద్ర ఎన్నికల సంఘం అందించిన అసెంబ్లీ నియోజకవర్గాలవారీ ఓటరు జాబితా ఆధారంగా సంబంధిత విభాగాలు గ్రామ పంచాయితీ, వార్డులవారీగా ఓటరు జాబితా ఇప్పటికే సిద్ధం చేశాం. ఈ వివరాలను సమీకరించి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల ఓటర్ల జాబితా తయారు చేయనున్నాం. మండల పరిషత్ కార్యాలయాల్లో పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్‌ను ఈ నెల 11న ప్రదర్శిస్తాం. 13వ తేదీ వరకు అభ్యంతరాలపై సంబంధిత అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారు. అదేరోజు రాజకీయ పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం. ఆ తర్వాత వచ్చిన ఫిర్యాదులను 14న ప్రదర్శిస్తారు. 15వ తేదీన పోలింగ్ కేంద్రాలవారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శిస్తాం.

-ఎల్లయ్య, జిల్లా పరిషత్ సీఈవో, మెదక్

బడికి దూరంగా 307 మంది

- లెక్క తేల్చిన పాఠశాల విద్యాశాఖ
- సంగారెడ్డి జిల్లాలో ముగిసిన బడి బయటి పిల్లల సర్వే

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యంగా విద్యాశాఖ చేపట్టిన బడి బయట పిల్లల గుర్తింపు సర్వే ముగిసింది. జిల్లా వ్యాప్తంగా బడికి దూరంగా 307 మంది పిల్లలున్నట్లు విద్యాశాఖ తేల్చింది. గత నెల 16 న ప్రారంభమైన బడి బయటి పిల్లల సర్వే 31న ముగిసింది. జిల్లావ్యాప్తంగా సీఆర్పీ, ఐఈఆర్పీలు సర్వేలో పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలబాలికల విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ చాలా మంది బడికి దూరంగానే ఉంటున్నారు. కొందరైతే బడి ముఖం అసలే ఎరుగకపోగా మరికొందరు మధ్యలోనే మానేస్తున్నారు. ఎన్ని సర్వేలు చేసినా.. పిల్లలు చదువుకోవాలని అధికారులు పదేపదే చెబుతున్నా, బాల్యం మాత్రం బడిబయటే మగ్గుతున్నది. కొందరు బడికి వచ్చి మధ్యలో ఆగిపోయిన వారు ఉంటున్నారు. దీంతో బడి బయటి పిల్లలను బడిలో చేర్పించేందుకు పాఠశాల విద్యా శాఖ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలో బడిబయటి పిల్లల గుర్తింపు సర్వే(ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్-ఓఎస్‌సీ)ను అధికారులు చేపట్టారు. సర్వేలో భాగంగా పని ప్రదేశాలు, పరిశ్రమలు, ఇటుక బట్టీలు, దుకాణాల్లోనూ పరిశీలించి బడి బయటి పిల్లల్ని గుర్తించారు. ఇందులో భాగంగా 6-14 ఏళ్ల లోపు పిల్లలు 307 మంది బడికి దూరంగా ఉంటున్నట్లు విద్యా శాఖ సర్వే ద్వారా తేల్చారు. విద్యార్థి సామర్థ్యం, వయసు ప్రకారం వీరి అర్హత ఆసక్తిని బట్టి తగిన తరగతిలో చేర్పించటం, దూర విద్యలో ప్రవేశాలు కల్పించేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటుందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.



సంగారెడ్డిలో బడి బయటి పిల్లల సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు, సీఆర్పీ (ఫైల్)



సన్ డే

7 లో

- ఫిబ్రవరిలోనే మండుతున్న ఎండలు
- ఉమ్మడి జిల్లాలో 37 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- సాధారణం కంటే 3 డిగ్రీలు అధికం
- అత్యధికంగా సిద్దిపేటలో 37.5 డిగ్రీలు నమోదు
- మున్ముందు మరింత పెరిగే అవకాశం

ఐదో రోజూ నిరసనలు

- ప్యారానగర్‌లో డంపుయార్డ్ నిర్మాణం ఆపే వరకు పోరాటం
- ప్రభుత్వానికి రైతు జేఏసీ హెచ్చరిక

6 లో

బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ

- బీఆర్ఎస్ పని అయిపోయింది
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

7 లో



'ప్రమాణ' జోష్

హోరెత్తిన గీతం వర్సిటీ

7 లో

ఉర్సే షరీఫ్ జాతర మతసామరస్యానికి ప్రతీక

● జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్





జాతర సంతలో పశువులతో రైతులు, మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌షెట్కార్

న్యాల్‌కల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : న్యాల్‌కల్ మండలంలోని గట్టుపైన నిర్వహిస్తున్న ఉర్సే షరీఫ్ పీర్ గైబ్‌సాహెబ్ దర్గా జారత ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ పేర్కొన్నారు. ఆదివారం జాతరలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జాతర సందర్భంగా నిర్వహించే పశువుల సంతకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పశువులతో రైతులు తరలిరావడం సంతోషకరమన్నారు. ఈ జాతర రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. న్యాల్‌కల్ గ్రామానికి చెందిన పశుప్రేమికుడు హోతిబస్వరాజ్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కొన్నేళ్లుగా ఉత్తమపశుపోషకులకు బహుమతులను అందజేయడం అభినందనీయమన్నారు.

ఏడుపాయలలో భక్తుల సందడి





వనదుర్గ అమ్మవారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

పాపన్నపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఉమ్మడి జిల్లావాసులతో పాటు పరిసర జిల్లాలు, జంట నగరాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు అమ్మనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం దర్శనం కల్పించారు. మంజీరా నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మాతను దర్శించుకున్నారు. బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సైనిక్ స్కూల్‌లో ఘనంగా వార్షికోత్సవం

ములుగు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని సైనిక్ స్కూల్ మొదటి వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఏరియా ఎడ్యుకేషన్ డైరెక్టర్ బ్రిగేడియర్ ప్రశాంత్ హల్గేరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రేపటి భవిష్యత్తు కోసం సైన్యంలో దేశభక్తి, క్రమశిక్షణ పాత్రను వివరిస్తూ విద్యార్థులను ప్రేరేపించేలా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్, ఎక్స్ ఆర్మీ ఆఫీసర్ డా. బి. శేషరెడ్డి నేతృత్వం వహించారు. డైరెక్టర్ డీన్, వినోద్ బంగా(రిటైర్డ్ నేవీ కమాండర్), వైస్ ప్రిన్సిపాల్ మానసా చౌదరి పాల్గొన్నారు.

ఘనంగా రెసో దర్పణ్ వేడుకలు

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రెసోనెన్స్ గురుకుల స్కూల్ పటాన్‌చెరు క్యాంపస్‌లో ఆదివారం రెసో దర్పణ్ పేరుతో వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రఖ్యాత రచయిత, నటుడు తనికెళ్ల భరణి, సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు. ఐఐటీ జేఈఈ, నీట్, జేఈఈ (మెయిన్స్ + అడ్వాన్స్‌డ్), ఇతర ఇంజనీరింగ్, మెడికల్, కామర్స్ లా ప్రవేశ పరీక్షలలో శిక్షణ ఇచ్చే రెసోనెన్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇనిస్టిట్యూట్ తెలంగాణ, ఏపీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఈ వేడుక విజయాలను గుర్తించడమే కాకుండా ఉత్సాహంతో జరుపుకునే ఒక ప్రయాణం అన్నారు. అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడంలో, స్ఫూర్తిని నింపడంలో ముందుంటున్నారని తెలిపారు. పటాన్‌చెరువు ఎంఈవో నాగేశ్వర్‌నాయక్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డంపుయార్డ్ నిర్మాణం ఆగే వరకు పోరాటం

● ప్రభుత్వానికి రైతు జేఏసీ హెచ్చరిక.. ఐదో రోజూ నిరసన



గుమ్మడిదలలో ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ

గుమ్మడిదల ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్యారానగర్ డంపుయార్డ్ నిర్మాణం ఆగే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని రైతు జేఏసీ హెచ్చరించింది. గుమ్మడిదల మండలం ప్యారానగర్ గ్రామ శివారులో జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టిన డంపుయార్డ్‌పై మండలంలో చేపట్టిన ఆందోళన ఆదివారం ఐదో రోజుకు చేరింది. గుమ్మడిదల, నల్లవల్లి, బొంతపల్లి, దోమడుగు గ్రామాల్లో జేఏసీ ఆధ్వర్యంలో రోడ్లపైకి వచ్చి, వాడవాడలా తిరుగుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ డంపుయార్డు పనులు ఆపాలని డిమాండ్ చేశాయి. నల్లవల్లి గ్రామంలో ప్రజలు ప్రధాన రహదారిపై బైఠాయించారు. డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని నినదించారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే ఆందోళనను ఇంకా ఉధృతం చేస్తామని హెచరించారు. ఈ గ్రామాల్లో పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మండల వ్యాప్తంగా గట్టి నిఘా పెట్టారు.

రాజకీయ లబ్ధి కోసం ఎస్సీ వర్గీకరణ సరికాదు

● రౌండ్ టేబుల్ సమావేశంలో మాల ఉపకులాల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాల ఉపకులాల నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసం ఎస్సీ వర్గీకరణ సరికాదని మాల ఉపకులాల నాయకులు డిమాండ్ చేశారు. గజ్వేల్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని గౌరవిస్తూ సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం నడచుకోవాలని, కేంద్ర ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం ఎస్సీలను విభజించు, పాలించు అనే విధానాన్ని అమలు చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ తప్పుడు విధానాలను విరమించుకోవాలని లేనిపక్షంలో మాలల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. ఈ నెల 14న నిర్వహించే రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలెంక నర్సింలు, చిప్పల యాదగిరి తదితరులున్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి


అబ్దుల్ రహీమ్(ఫైల్)

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన హవేళిఘణపూర్ మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం మెదక్ పట్టణం నవాబుపేటకు చెందిన అబ్దుల్ రహీమ్(27) తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నాన్న వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్తున్నాని ఇంట్లో చెప్పి స్కూటీ తీసుకుని వెళ్లాడు. చాలా సమయం అయిన ఇంటికి రాకపోవడంతో రహీమ్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. హవేళిఘణపూర్ మండలంలోని ఔరంగాబాద్ శివారులో మెదక్- బోధన్ రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అక్కడికక్కడే మరణించాడు. మృతదేహం ముక్కలు ముక్కలు కావడంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. మృతుని వద్ద లభించిన డ్రైవింగ్ లైసెన్స్‌తో రహీమ్‌గా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. రహీమ్ బంధువు అబ్దుల్ వాహబ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పంచనామ నిర్వహించి పోస్టుమార్టుకు పంపినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

హైవేపై కారు పల్టీ.. నలుగురికి గాయాలు

రామాయంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర వెళుతున్న కారు అదుపు తప్పి డివైడరు ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆదివారం వేకువజామున రామాయంపేట సమీపంలోని సెల్ టవర్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

శివ్వంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చిన్నగొట్టిముక్ల గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపి వివరాల మేరకు సంగారెడ్డి జిల్లా కంది మండలం చిగురుప్ప గ్రామానికి చెందిన మడుముల నర్సింహులు(38) భార్య కుటుంబ తగాదాలతో ఎనిమిది నెల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా మృతుని అన్న మడుముల ఆంజనేయులు బతుకుతెరువు కోసం శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల గ్రామానికి వచ్చి మిషన్ భగీరథ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం అన్న దగ్గర ఉంటున్న తల్లిని చూడడానికి వచ్చిన నర్సింహులు చెరువు సమీపంలో మర్రిచెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ మధుకర్‌రెడ్డిని సంప్రదించగా మృతునికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

14 ఎకరాల చెరకు తోట దగ్ధం

● రూ.8 లక్షల వరకు నష్టం


పెద్దారెడ్డిపేట గ్రామ శివారులో తగులబడుతున్న చెరకు తోట

పుల్‌కల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దారెడ్డిపేట గ్రామ శివారులో ఓ రైతుకు చెందిన చెరకు తోట ఆదివారం పూర్తిగా దగ్ధమైంది. గ్రామ శివారులోని 299, 300, 301లో సర్వే నంబర్లలో 14 ఎకరాల్లో గ్రామానికి చెందిన రైతు కుమ్మరి లింగయ్య చెరకు తోటను సాగు చేస్తున్నారు. పంట కోతకు వచ్చినప్పటికీ కూలీల కొరత కారణంగా నరకడానికి ఆలస్యమైంది. అయితే, సోమవారం నుంచి చెరకు తోట నరికేందుకు కూలీలతో ఒప్పందం కుదుర్చుకున్న రైతు లింగయ్య ఆదివారం ఏడుపాయలకు దర్శనానికి బయలుదేరి వెళ్తున్నారు. అంతలోనే చెరకు తోట తగులబడి పోతున్న సమాచారం తెలుసుకుని, జోగిపేటలోని అగ్నిప్రమాద కేంద్రానికి తెలియజేశారు. అగ్నిమాపక వాహనంతో సిబ్బంది హుటాహుటినా అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. మంటలధాటికి తోట పూర్తిగా తగులబడిపోయింది. ఫలితంగా రైతు లింగయ్యకు రూ.8 లక్షలు ఆస్తినష్టం జరిగింది.

ఓఆర్ఆర్‌పై 23 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


ఔటర్ రింగ్ రోడ్డుపై పట్టుకున్న లారీ

రామచంద్రాపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం ఎస్‌వోటీ, పోలీసులు సంయుక్తంగా సోదాలు నిర్వహించి పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. కొల్లూరు ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన రాజుచౌహాన్ అనే వ్యక్తి నగరంలోని రాజేంద్రనగర్ నుంచి 23టన్నుల రేషన్ బియ్యాన్ని లారీలో తీసుకుని కర్ణాటకకు తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో కొల్లూరు శివారులోని ఓఆర్ఆర్‌పై తనిఖీ చేపట్టి 23 టన్నుల బియ్యం లోడు లారీని పట్టుకున్నారు. లారీని పోలీసు స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. నిందితుడు రాజుచౌహాన్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. సోమవారం పౌరసరఫరాల శాఖ అధికారులకు బియ్యాన్ని అప్పగిస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల మైదానంలో సూర్య నమస్కారాల ప్రదర్శన

వండర్‌ఫుల్



ఉత్సాహంగా శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన

● వండర్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు
● 1,484 మంది.. 4,02,154 సూర్య నమస్కారాలతో రికార్డ్

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నాలుగు లక్షలకు పైగా సూర్య నమస్కారాలు చేసి రికార్డ్ నెలకొల్పారు. వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ రికార్డులో నమోదైంది. ఈ అద్భుత కార్యక్రమానికి సిద్దిపేట పట్టణం వేదికైంది. రాష్ట్ర యోగా అధ్యయన పరిషత్ సభ్యులు, జాతీయ యోగా మెడలిస్ట్, ప్రముఖ యోగా గురువు తోట సతీష్ నేతృత్వంలో ప్రభుత్వ బాలికల పాఠశాల మైదానంలో ఆదివారం శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ప్రారంభించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి వచ్చిన 1,484 మంది యోగా సాధకులు పాల్గొని ఉత్సాహంగా సూర్య నమస్కారాలు చేశారు. లక్ష వరకు చేయడం లక్ష్యం కాగా 4,02,154 సూర్య నమస్కారాలు చేసి యోగ సాధకులు ప్రపంచానికి ఆరోగ్య సందేశాన్ని ఇచ్చారు.

యోగా ఆరోగ్య ప్రదాయిని

యోగా శారీరక ధృడత్వాన్ని, మానసిక ప్రశాంతతను చేకూర్చుతూ ఆరోగ్య ప్రదాయినిగా నిలుస్తుందని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. మారుతున్న పరిస్థితుల్లో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని అందించే యోగ మానవాళికి అమృత వాహిని అన్నారు. ఈ అద్భుత ప్రదర్శన ద్వారా సిద్దిపేట జిల్లా కీర్తిని ప్రపంచానికి సగర్వంగా చాటి చెప్పిన నిర్వాహకులను అభినందించారు. ఈ ప్రదర్శనలో కొందరు వృద్ధులు సైతం ఉత్సాహంగా పాల్గొని అద్భుత ప్రదర్శనతో భావితరాలకు స్ఫూర్తి అందించారని ప్రశంసించారు.


వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ అందుకుంటున్న నిర్వాహకులు, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేట సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి మాట్లాడుతూ భారతీయ యోగశాస్త్రం ప్రపంచానికి మార్గదర్శకమన్నారు. ఆరోగ్యానికి దగ్గరగా ఉండాలనుకునేవారు యోగ సాధన చేయాలని సూచించారు. రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రావు మాట్లాడుతూ ముంచుకొస్తున్న ముప్పుల నుంచి యోగ సాధన మాత్రమే మనలను రక్షిస్తుందని స్పష్టం చేశారు. కరోనా సమయంలో ఎందరో వ్యక్తులు యోగాసాధనతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని గుర్తుచేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలను విస్తృత పరుస్తున్నామని చెప్పారు. రాష్ట్ర యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం విభిన్న యోగా కార్యక్రమాలతో సమాజాన్ని ఇటు వైపు మళ్లించడానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడానికి పనిచేయాలని సూచించారు.


శత సహస్ర యోగా ప్రదర్శనలో పాల్గొన్న యోగా సాధకులు

రాష్ట్రస్థాయి యోగా పోటీలు

శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన రికారు నెలకొల్పగా ఇదే వేదికగా రాష్ట్రస్థాయి యోగా పోటీలను నిర్వహించారు. 25 సంవత్సరాలలోపు, 25 సంవత్సరాలపై వయస్సు వారికి పురుషులకు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరిగాయి. నాలుగు విభాగాల్లో జరిగిన పోటీల్లో ఐదు సంవత్సరాల నుంచి మొదలుకుని 72 సంవత్సరాల వయసున్న వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు, యోగా సాధకులకు అతిథులు మెడల్, సర్టిఫికెట్లను ప్రధానం చేశారు.

ఆ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు విరాహత్ అలీ, సిద్దిపేట జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు రంగాచారి, వ్యాస మహర్షి యోగా సొసైటీ చైర్మన్ డాక్టర్ అరవింద్, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ విక్రమ్ రెడ్డి, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, ట్రస్మా సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ

బీఆర్ఎస్ పని అయిపోయింది
ఉద్యమగడ్డ అని చెప్పుకునే జిల్లాలోనే అభ్యర్థి లేడు
మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందని భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీల మధ్యనే పోరు జరగనుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పని అయిపోయిందన్నారు. పొద్దున లేస్తే 'మా సత్తా చూపిస్తాం' అని చెప్పుకునే బీఆర్ఎస్ పార్టీకి నలుగురు మేధావులు, పెద్దమనుషులు ఉన్న సొంత జిల్లాలోనే అభ్యర్థి లేకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా ఎప్పుడైతే మారిందో అప్పుడే ఆ పార్టీ పని కథ ముగిసిపోయిందని ఎద్దేవాచేశారు. భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేస్తే బీఆర్ఎస్‌కు మూడో స్థానమే మిగులుతుందన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డికి కుర్చీ భయం పట్టుకుందని 14 నెలలలో కాంగ్రెస్ రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమీ లేదని విమర్శించారు. దేశంలో మూడు రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారంలో ఉందని అవి కూడా పూర్తయిపోతే కాంగ్రెస్ ముక్తాభారత్‌గా మిగులుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడానికి ప్రజలు మేధావులు సిద్ధంగా లేరని, ఇక మిగిలింది బీజేపీ ఒక్కటేనన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు దూది శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు మిగిలింది గాడిద గుడ్డు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మిగిలింది గాడిద గుడ్డు అని, ప్రజలు గుండు సున్నాకు పరిమితం చేశారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఢిల్లీలో చెల్లె కవితతో కలిసి సీసాలు అమ్మితే వచ్చి డబ్బుతో కేజ్రీవాల్ శీష్‌మహల్ పేరుతో అద్దాల మేడ నిర్మించాడని ఆరోపించారు. అవినీతి మరకు ఉన్నా ఏ రాజకీయ పార్టీని ప్రజలు దగ్గరకు తీయలేదన్నారు. ప్రస్తుత సమాజంలో మార్పు వచ్చిందని, కష్టపడి నిజాయితీగా ఉంటేనే ప్రజలు ఆదరిస్తారని, లేదంటే అధఃపాతానికి తొక్కుతారని ఢిల్లీలో వచ్చిన ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. భవిష్యత్‌లో తెలంగాణలో వచ్చేది బీజేపీ సర్కారే అని ఎంపీ ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పట్టుభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేశంగౌడ్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి పంజా విజయ్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

'ప్రమాణ' జోష్


పాట పాడుతున్న ప్రముఖ సింగర్ మంగ్లీ

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్, డీజే నైట్, ర్యాంప్ వాక్, ఆటో ఎక్స్‌పో, వర్క్‌షాప్స్ ఒకటేమిటి ఇలా సాంస్కృతిక, సాంకేతిక కార్యక్రమాలతో గీతం వర్సిటీ హోరెత్తింది. పటాన్‌చెరు రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రమాణ-2025 వేడుక ఆదివారంతో ముగిసింది. ఈ వేడుకలో విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసే పలు కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం మ్యూజికల్ నైట్‌లో ప్రముఖ సింగర్‌లు మంగ్లీ, నిఖితా గాంధీ తమ పాటలతో హుషారెత్తించారు. చివరి రోజు ప్రపంచ ప్రసిద్ధ జూలియా బ్లిస్, ప్రో బ్రదర్స్ అద్భుతమైన ఈడీఎం - డీజే నైట్ ప్రదర్శనతో వేడుకను విజయవంతంగా ముగించారు. గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు పర్యవేక్షణలో రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, అధ్యాపక సలహాదారు ప్రొఫెసర్ పి.త్రినాథరావు, డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ప్రతినిధి రాహుల్ మండల్, అధ్యాపకులు, ప్రమాణ కోర్ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



కేరింతలు కొడుతూ సెల్ఫీ దిగుతున్న విద్యార్థులు


యువతి ర్యాంప్ వాక్

ఫిబ్రవరిలోనే మండుతున్న ఎండలు

సన్‌డే

ఉమ్మడి జిల్లాలో 37 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
సాధారణం కంటే 3 డిగ్రీలు అధికం
అత్యధికంగా సిద్దిపేటలో 37.5 డిగ్రీలు
మున్ముందు మరింత పెరిగే అవకాశం



మెదక్ అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. చలి తీవ్రత తగ్గడంతో సూరీడు సుర్రుమంటున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండడంతో ఉక్కపోత మొదలైంది. మార్చి నెలలలో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతలు ఇప్పుడు ఫిబ్రవరిలోనే రికార్డు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా సిద్దిపేటలో 37.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో 37.1, డిగ్రీలు, వట్‌పల్లిలో 36.1, మెదక్ జిల్లా నర్సాపూర్‌లో 36.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే మూడు డిగ్రీలు అధికమని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో కూడి పెరుగుదల కనిపిస్తోంది. మొన్నటి వరకు 12 నుంచి 15 డిగ్రీల వరకు నమోదయ్యాయి. అయితే, ఆదివారం ఉమ్మడి జిల్లాలో అన్ని మండలాల్లో 16 నుంచి 21 డిగ్రీల వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వేడిగాలుల ప్రభావంతో..

తూర్పు ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్న వేడి గాలులు ప్రభావంతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయని వాతావరణ శాఖ కేంద్రం అధికారులు చెబుతున్నారు. మార్చి నెలలలో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతలు ఫిబ్రవరి నెలల ఆరంభం నుంచి ఎండలు దంచికొడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. మున్ముందు ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. రానున్న మూడు రోజుల పాటు వాతావరణం పొడిగా ఉంటుందని తెలిపింది. ఇక ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో పాటు ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల వినియోగం కూడా పెరిగింది. పెరుగుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలు సరైన జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

జహీరాబాద్ ఆర్టీసీకి డ్రైవర్ల కొరత

- ఉన్న సిబ్బందితో అధికారుల సర్దుబాటు
- అదనపు డ్యూటీలతో ఇబ్బందులు



జహీరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్

జహీరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో గల ఆర్టీసీ డిపోను డ్రైవర్ల కొరత వేధిస్తోంది. దీంతో బస్సులను సమయానికి నడపాలన్నా ఆర్టీసీ అధికారులకు తిప్పలు తప్పడం లేదు. ప్రయాణీకుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అరకొర ఉన్న డ్రైవర్లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ అదనపు పారితోషికం ఇస్తున్నామని అధికారులు ప్రకటిస్తున్నా.. ఉన్న డ్రైవర్లకు భారంగా మారుతోంది. జహీరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో 92 బస్సులున్నాయి. అందులో 29 ప్రైవేటు, 63 ప్రభుత్వ బస్సులు ఉన్నాయి. ప్రతిరోజు ఆయా బస్సులు 34,234 కిలోమీటర్లు తిరుగుతుండగా.. రోజుకు సగటున రూ.19.70 లక్షల ఆదాయం వస్తుంది. అయితే 140 మంది డ్రైవర్లు అవసరం కాగా.. ప్రస్తుతం 110 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. బీదర్ నుంచి జహీరాబాద్ మీదుగా హైదరాబాద్, తదితర ప్రాంతాలకు ప్రతిరోజు సగటున 80 వేల మంది ప్రయాణీకులు ప్రయాణిస్తున్నారు. ఇందులో జహీరాబాద్ డిపో మీదుగా ఆర్టీసీలో 35 వేల మంది, కర్ణాటక ఆర్టీసీ డిపోలో 20 వేలపై చిలుకు, ఇతరత్రా వాహనాల ద్వారా 25 వేల మంది ప్రయాణం సాగిస్తుంటారు. అయితే జహీరాబాద్ డిపోలో డ్రైవర్ల కొరత వల్ల ఉన్న డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రైవర్ల సంఖ్యను పెంచితే.. ప్రయాణీకుల సంఖ్య రెట్టింపు కావడంతో పాటు అదనపు ఆదాయం వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

డ్రైవర్ల కొరత విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం



జహీరాబాద్ ఆర్టీసీ డిపోకు డ్రైవర్ల కొరత ఉంది. తమ డిపోకు సుమారు 28 మది డ్రైవర్లు అవసరం ఉందని ఉన్నతాధికారులకు నివేదించాం. ఉన్న డ్రైవర్లకు బాధ్యతలతో పాటు అదనంగా పారితోషికం ఇస్తున్నాం. అదనపు డ్యూటీకి వెళ్తే రూ.1000 ఇవ్వడంతోపాటు ఇన్సెంటివ్ ఇస్తున్నాం. అలాగే ప్రైవేటు డ్రైవర్లకు కూడా బస్సుల యజమానులు అందజేస్తున్నారు. ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండా బస్సులు నడిపిస్తున్నాం.

- జాకీర్‌హుస్సేన్, డిపో మేనేజర్

అమీన్‌పూర్ రోడ్డు నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలి

- సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన, గాంధీ విగ్రహానికి వినతిపత్రం



కాలనీవాసులతో అమీన్‌పూర్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గుంతలమయంగా మారి, దుమ్ము, ధూళి రేగుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న అమీన్‌పూర్-చందానగర్ రోడ్డు విస్తరణ పనులను తక్షణం పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆయా కాలనీవాసులతో కలిసి సీపీఎం నాయకులు రహదారిపై ఆందోళన చేపట్టారు. అనంతరం అధికారుల వైఫల్యాన్ని ఎండగడుతూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నర్సింహారెడ్డి, పాండురంగారెడ్డి, లలిత మాట్లాడుతూ ప్రజల నుంచి పన్నులు వసూళ్లు చేసే శ్రద్ధ పాలకులకు మౌలిక వసతులు కల్పించడంలో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చందానగర్, గచ్చిబౌలి, మియాపూర్, మాదాపూర్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు అమీన్‌పూర్ నుంచి ఉన్న ఏకైక రోడ్డు అధ్వాన్నంగా తయారైందన్నారు. వెంటనే రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయాలన్నారు. ఈ ఆందోళనలో కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, సీపీఎం నాయకులు జార్జ్, వీరాస్వామి, అనంతరావు, శ్రీనివాస్ రెడ్డి, మునిరాజు, సునీత పాల్గొన్నారు.

రాజకీయాలపై కేటీఆర్‌తో ఎమ్మెల్యే చర్చ



కేటీఆర్‌తో ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవనంలో కలిశారు. ఈ సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలపై కేటీఆర్‌తో చర్చించారు. ముఖ్యంగా అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేగా ఉన్నా ప్రొటోకాల్ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న పలు అంశాలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. అధికార పార్టీ నాయకులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా మీ పోరాట పటిమ అద్భుతమని, మీకు పార్టీ అన్నివిధాలు అండగా ఉంటుందని, ప్రజల పక్షాన నిలిచి, ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సునీతారెడ్డి వెంట బీఆర్ఎస్ నాయకుడు సంతోష్‌రెడ్డి కూడా ఉన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం



విజేతగా నిలిచిన టీంకు ట్రోఫీతో పాటు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని కాంగ్రెస్ నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. 15 రోజుల పాటు నర్సాపూర్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ముగియగా.. సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మొదటి బహుమతి కింద ట్రోఫీతో పాటు రూ.లక్ష నగదును సంగారెడ్డికి చెందిన ఎంఎస్ క్రికెట్ అకాడమీ టీంకు, రెండో బహుమతిగా రూ.50,909 నగదు, ట్రోఫీని నర్సాపూర్‌కు చెందిన సర్కిల్ టీంకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ యువతకు క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్ ప్రత్యేక చొరవతో ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, లలిత, మండల, పట్టణ అధ్యక్షులు మల్లేశం, అంజిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

తుంబురేశ్వ స్వామి ఉత్సవాల్లో బండ్ల ఊరేగింపు



వెల్పుగొండలో స్వామివారికి బండ్ల ప్రదర్శన

టేక్మాల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేల్పుగొండ గ్రామంలో తుంబురేశ్వర స్వామి ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగురంగులతో అలంకరించిన బండ్లను పురవీధుల గుండా తిప్పారు. స్వామిని భక్తులు దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అచ్చంపేటలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు

- 416 ఎకరాల భూసేకరణకు సర్వే
- 70 మంది రైతులకు నోటీసులు అందజేత



సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

మెదక్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామ పరిధిలోని 416.20 ఎకరాల్లో టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేసేందుకు అధికారులు సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం అచ్చంపేట గ్రామంలోని సర్వే నెంబరు 61, 56, 115, 122, 130, 132లలోని భూములను రెవెన్యూ, టీఎస్ఐఐసీ అధికారులు పరిశీలించారు. ఇందులో రికార్డుల సవరణ కోసం 70 మంది రైతులకు నోటీసులు అందజేశారు. త్వరలోనే మిగతా రైతుల రికార్డులు పరిశీలించి భూ సేకరణ ప్రక్రియను వేగవంగం చేయనున్నట్లు వారు తెలిపారు.

విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్‌కుమార్ అన్నారు. సంగారెడ్డిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరంతరం ఉపాధ్యాయుల వైపు నిలిచి విద్యారంగ సంక్షేమానికి పాటుపడతానని తెలిపారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్, టీఎస్‌యూటీఎఫ్, ఎస్సీఎస్టీయూఎస్, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు

మెదక్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయాగ్రామాల రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ డీఈఈ రాంచందర్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్ఆర్ గ్రాంటు కింద నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో సుమారు ఏడు కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. పీడబ్ల్యూడీ రోడ్డు చున్నంబట్టితండా నుంచి పడియాల్ తండా వరకు రూ.70 లక్షల, 65వ నంబరు జాతీయ రహదారి నుంచి బూచనెల్లి వెళ్లే రోడ్డుకు రూ.2 కోట్లు, అల్లీపూర్‌రోడ్డుకు రూ.కోటి, కోహీర్- పైడిగుమ్మల్ రోడ్డుకు రూ.1.20 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో టెండర్లు వేసి పనులు పూర్తిచేస్తామన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మండలం పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో కొలువైన్న మల్లన్న ఆలయంలో మల్లికార్జునస్వామి జాతరను మక్తభూపతిపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులోభాగంగా వీరగంధాలు, అగ్నిగుండాలు నిర్వహించారు. మక్తభూపతిపూర్, తిమ్మానగర్, గుట్టకిందపల్లి ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి ఉత్సవం

ఐడీఏబొల్లారం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడ పట్టణంలో ఆదివారం భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఉత్సవం వైభంగా నిర్వహించారు. మండపంలో పట్టణ పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రారెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, మాధవరెడ్డి, హనుమంతురెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

23న జాతర

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయ జాతర 23న జరపనున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు ఆదివారం జాతరకు సంబంధించిన గోడపత్రిను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పానగేష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సింహ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి సేవలో మాజీ సీఎంవో ముఖ్య కార్యదర్శి

శివ్వంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుట్టపై వెలసిన సికింద్లాపూర్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం నాలుగోవారం జాతర సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి ధనుంజయశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సీఎంవో ముఖ్య కార్యదర్శి సింగాయిపల్లి వినీతనర్సింగరావు దంపతులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో శశిధర్‌గుప్తా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పూజారి విద్యాకర్‌చారి, సిబ్బంది పాల్గొన్నారు.



మాధవానందస్వామి ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

సిద్ధిరామేశ్వరాలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : హవేళిఘణపూర్ మండలం వాడి గ్రామంలోని సిద్ధేశ్వరాలయ నవ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. తొగుట పీఠాధిపతి మాధవానంద స్వామి హాజరై భక్తులకు ప్రవచనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యామిరెడ్డి, లక్ష్మారెడ్డి, రాజు, భిక్షపతిరెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

'బండి'ని కలిసిన నాయకులు



బండి సంజయ్‌తో నాయకులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని ఆదివారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, జిల్లా నాయకులు శేరికార్ అరుణ్‌రాజ్, ఖేడ్ మండల అధ్యక్షుడు సిందోల్ దశరత్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పట్నం మాణిక్, ఖేడ్ నాయకులు అరవింద్ తదితరులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో కూడా రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య, పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపునకు కృషి చేయాలని బండి సంజయ్ వారికి సూచించారన్నారు.

ఆర్యవైశ్య జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



సంగారెడ్డిలో ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజి అనంతకిషన్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంగారెడ్డి పట్టణ శివారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం కార్యవర్గసభ్యులను మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజి అనంతకిషన్ సన్మానించారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దయాకర్, కోశాధికారిగా మల్లికార్జున్, అదనపు ప్రధాన కారయదర్శిగా పి.ప్రకాష్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాస్, పరిశీలకులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నాకర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మణ్, మాజీ అధ్యక్షుడు మాణిక్‌ప్రభు, పట్టణ అధ్యక్షుడు విద్యాసాగర్, కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

డ్రైనేజీ లైన్‌ను మార్చాలని లేఖ రాశాం

- ఇరిగేషన్ డీఈ రామస్వామి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీ లైన్‌ను మార్చాలని హైడ్రాకు సంబంధించిన కాలుష్య నివారణ శాఖకి లేఖ రాశామని ఇరిగేషన్ డీఈ రామస్వామి తెలిపారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన రేడియల్ రోడ్డుపై మురుగు పరుగు కథనానికి ఆయన స్పందించారు. ఆంధ్రజ్యోతి వార్త అక్షర సత్యమన్నారు. రెండు అపార్టుమెంట్లకు ఎస్టీపీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించడంతో పాటు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువస్తామన్నారు. కాగా కథనంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమమైందని చిరువ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

సేవాలాల్ మహరాజ్ అందరికీ స్ఫూర్తి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో శ్రీనివాస్

కల్హేర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : సేవాలాల్ మహరాజ్ అందరికీ స్ఫూర్తి అని బంజారా సేవా సంఘ్ రాష్ట్ర నాయకులు, జంలాతండా మాజీ సర్పంచ్ దివ్యభారతి చరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సేవాలాల్ జయంతి సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవో నాగారం శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. సిర్గాపూర్ మాజీ సర్పంచ్ వైజయంతిశ్రీనివాస్ రావ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రమేష్‌చౌహాన్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆవిర్భావంతో నూతనోత్సాహం



పీఆర్టీయూ జెండా ఎగురవేసి ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

కల్హేర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఏర్పాటుతో ఉపాధ్యాయ వర్గాల్లో నూతనోత్సాహం వచ్చిందని ఆ సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ అన్నారు. పీఆర్టీయూ సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన కల్హేర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పీఆర్టీయూ జెండా ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తమ సంఘం పోరాట పటిమ కలిగి రాష్ట్ర ప్రభుత్వాలకు అన్నిరకాలుగా సహకరిస్తూనే ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించుకున్న ఘనత ఉన్నదన్నారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల గౌరవ అధ్యక్షుడు గుండు గోవర్ధన్ పాల్గొన్నారు.

హామీని మరిచిన కాంగ్రెస్ నాయకులు

నిజాంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పక్షంరోజుల్లో రోడ్డు పనులు ప్రారంభిస్తామని హామీనిచ్చి నేటికీ పనులు చేపట్టకపోవడంపై ఆగ్రహించిన గ్రామస్థులు ఆదివారం మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతనెల 11 నుంచి 25వ తేదీవరకు మండల కేంద్రంలో నిరసన దీక్షలు చేపట్టగా.. పక్షంరోజుల్లో పనులు ప్రారంభిస్తామని కాంగ్రెస్ మండల నాయకులు దీక్షా శిబిరానికి వచ్చి హామీఇచ్చి దీక్షలు విరమింపజేశారన్నారు. అయితే నేటికీ హామీ నెరవేరలేదన్నారు. రోడ్డు పనులు చేపట్టకపోతే హామీఇచ్చిన కాంగ్రెస్ నాయకుల ఇంటి ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని వారు హెచ్చరించారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం



హృషిక్(ఫైల్)

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కాలేజీలో ప్రాజెక్టు రిపోర్టు సబ్మిట్ చేయాలని వెళ్లిన ఓ బీటెక్ విద్యార్థి కనిపించకుండాపోయిన ఘటన జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ ఎస్.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.... సంగారెడ్డి పట్టణంలోని బ్రాహ్మణవాడకు చెందిన జాలా రవీందర్‌రెడ్డి, వాణిశ్రీ దంపతుల కుమారుడు హృషిక్‌రెడ్డి(22) నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్నం కాలేజీలో ప్రాజెక్టు రిపోర్టు సబ్మిట్ చేయాలని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తండ్రి రమేష్‌రెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమేష్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రమేష్ తెలిపారు. జనవరి 31న సంగారెడ్డి పట్టణంలోని శ్రీనగర్‌కు చెందిన కైసర్ ఇంటికి తాళం వేసి ఊరెళ్లగా.. తాళం పగులగొట్టి 23 తులాల వెండి, ఎల్ఈడీ టీవీ, స్పీకర్‌బాక్స్, పదికిలోల బియ్యం దొంగిలించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా.. ఆదివారం మార్కెట్‌లో ఉన్న కల్లు దుకాణంలో హనుమాన్‌నగర్‌కు చెందిన ఎండీ.రఫీక్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. నిజం ఒప్పుకున్నాడన్నారు. దీంతో అతడి నుంచి దొంగిలించిన వస్తువులను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

నారాయణఖేడ్/నర్సాపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మండల పరిధిలోని సత్యగామ గ్రామానికి చెందిన పుప్పాల రామయ్యకు సీఎం సహాయనిధి ద్వారా రూ.27 వేలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఖేడ్‌లో అందజేశారు. కొల్చారం మండలం రాంపూర్‌కు చెందిన గోవింద్‌రావుకు మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌వోసీని నర్సాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం గౌడ్, పీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు హకీం, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు హరీశ్ అందజేశారు.

సైక్లింగ్ డ్రైవ్

మెదక్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వారంలో ఒకమారు సైక్లింగ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం చిన్నారులు సైకిళ్లు తొక్కారు. ఆరోగ్యం కాపాడుకునే దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కోచ్ యాదగిరి తెలిపారు. సుమారు 40 మంది చిన్నారులు ఇందులో పాల్గొన్నారు.

నేషనల్ మీన్స్ స్కాలర్‌షిప్‌కు ఎలేందర్

పాపన్నపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి చెల్మటి ఎలేందర్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచాడు. ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్ రానున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

వ్యాయామం తప్పనిసరి

మెదక్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వ్యాయామం ప్రతీ మనిషికి అవసరమని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. చేగుంట మండల కేంద్రంలోని మక్క రాజుపేట చౌరస్తాలో యూత్ ఏర్పాటుచేసిన ప్రైవేట్ వ్యాయామశాలను ప్రారంభించారు.

ఉచిత కుట్టుమిషన్ శిక్షణ

శివ్వంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : భర్తలను కోల్పోయిన హెచ్ఐవీ బాధిత మహిళలకు సాధికారత స్వయం ఉపాధి కల్పించేందుకు హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ తొమ్మిదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కుట్టు మిషన్, జూట్ బ్యాగు తయారీపై శిక్షణా తరగతులను మగ్దుంపూర్‌లోని బేతాని సంరక్షణ అనాథాశ్రమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ హిమజ, ఫాదర్ రోబిన్ కర్మెన్ మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, మహిళా సాధికారత లక్ష్యంగా ఏడు వేల మంది విద్యార్థులను చదివించడమే కాకుండా.. ఎయిడ్స్ బాధిత మహిళలకు చేయూతను అందించాలనే ఉద్దేశంతో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

బీడీ వర్కర్స్ ఫెడరేషన్ సహాయ కార్యదర్శిగా లక్ష్మణ్

మెదక్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ అనుబంధ సంస్థ అయిన బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అయ్యావార్ల లక్ష్మణ్ నియమితులయ్యారు. ఉమ్మడి రామాయంపేట మండలం నిజాంపేట ప్రాంతానికి చెందిన లక్ష్మణ్ మూడు దశాబ్దాలుగా పార్టీకి తనవంతు సేవలందిస్తున్నాడు. దీన్ని గుర్తించిన సీఐటీయూ రాష్ట్ర నాయకత్వం ఇటీవల జరిగిన కోరుట్ల రాష్ట్ర మహాసభల్లో లక్ష్మణ్ పేరును ప్రతిపాదించారు.

పేకాట స్థావరంపై దాడి

వట్‌పల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4 లక్షలు, 15 సెల్‌ఫోన్లు, ఒక కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విఠల్ తెలిపారు. మండల పరిధిలోని మరవెల్లిలో పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి దాడిచేసినట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న 16 మందిపై కేసు నమోదు చేశామన్నారు.